అభివృద్ధి పథంలో 13వ డివిజన్

- ప్రభుత్వ పాఠశాలలు, పార్కుల అభివృద్ధి
- సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- రూ.5.60 కోట్లతో అభివృద్ధి పనులు
- డివిజన్‌లో అన్ని ప్రాంతాల్లో ఐదులైన్ల విద్యుత్ సరఫరా


అభివృద్ధి చెందిన రైలుపేట హైస్కూల్

మచిలీపట్నంటౌన్: నగర నడిబొడ్డున ఉన్న 13వ డివిజన్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) నివాస ప్రాంతంలో ఉన్న ఈ డివిజన్ నాలుగేళ్ల కాలంలో రూ.5.60 కోట్లతో అభివృద్ధి చెందింది. బచ్చుపేట, షేక్ ఇమామ్ స్ట్రీట్, రామానాయుడుపేట ప్రాంతాల్లో ఈ డివిజన్ విస్తరించి ఉంది. డివిజన్‌లో మౌలిక వసతుల సమస్య లేకుండా కార్పొరేటర్ గాజుల శ్రీదేవి పర్యవేక్షణలో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) పూర్తి సహాయ సహకారాలతో అభివృద్ధి పనులు జరిగాయి. రైలుపేట స్కూల్, లేడీ యాంప్తిల్ జూనియర్ కళాశాల, ఎలిమెంటరీ స్కూల్, హైస్కూళ్లను మనబడి నాడు - నేడు ఒకటి, రెండు విడతల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశారు. రహదారులను సిమెంటు రోడ్లుగా తీర్చిదిద్దారు. ఈ రోడ్లకు అనుసంధానంగా పక్కా డ్రెయిన్లు నిర్మించి మురుగునీటి సమస్యను పరిష్కరించారు. డివిజన్‌లోని ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా తీర్చిదిద్దారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

డివిజన్‌లోని రైలుపేట పాఠశాలను నాడు - నేడు ఫేజ్-1లో రూ.48.10 లక్షలతో అభివృద్ధి చేశారు. లేడీ యాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎలిమెంటరీ స్కూల్, హైస్కూళ్లను ఫేజ్-2లో రూ.2.07 కోట్లతో అభివృద్ధి చేశారు. తద్వారా డివిజన్‌లో విద్యావ్యాప్తికి ప్రభుత్వం పెద్దపీట వేసి అభివృద్ధికి తోడ్పాటును అందించింది. డివిజన్‌లో లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి నాలుగు నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, 20 నూతన ఎలక్ట్రికల్ పోల్స్‌ను ఏర్పాటు చేశారు. డివిజన్‌లో మొత్తం మూడు లైన్ల విద్యుత్ లైన్లను ఐదు లైన్లుగా మార్చారు.


లేడియాంప్తిల్ కళాశాల వద్ద నిర్మించిన సిమెంటు రోడ్డు

పార్కులు, రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి

డివిజన్‌లోని షార్కీ కాలనీ, బచ్చుపేటలో హిందూ కళాశాల వెనుక ఉన్న పార్కులను అభివృద్ధి చేశారు. ఈ రెండు పార్కులను రూ.75.06 లక్షలతో సుందరంగా తీర్చిదిద్దారు. 12 వీధులను రూ.1.86 కోట్లతో సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేశారు. ఐదు డ్రెయిన్లను రూ.39 కోట్లతో పక్కా డ్రెయిన్లుగా అభివృద్ధి చేశారు. రూ.4.45 లక్షలతో రెండు ప్రాంతాల్లో పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. డివిజన్‌లో మొత్తం 26 పనులను రూ. 5.60 కోట్లతో చేశారు.


షార్కీ కాలనీలో అభివృద్ధి చేసిన పార్కులోని జిమ్

పేర్ని నాని చొరవతో అభివృద్ధి



ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక చొరవతో డివిజన్‌ను ఎంతగానో అభివృద్ధి చేశాం. డివిజన్ మొత్తం సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు, పైప్‌లైన్లు ఏర్పాటు చేశాం. హిందూ కళాశాల వెనుక పల్లంగా ఉన్న రోడ్డుతోపాటు రామానాయుడుపేట సెంటర్ నుంచి జీజీహెచ్‌కు వెళ్లే రోడ్డు పల్లంగా ఉండటంతో లేడియాంప్తిల్ కళాశాల నుంచి గంగానమ్మ గుడి వరకు మెరక చేసి అభివృద్ధి చేశాం. అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే పేర్ని నానికి కృతజ్ఞతలు.

– గాజుల శ్రీదేవి, కార్పొరేటర్

ఇబ్బందులు తొలగాయి



హిందూ కళాశాల వెనుక రోడ్డు ఎన్నో ఏళ్లుగా పల్లంగా, గోతులు పడటంతో వర్షం వస్తే ఇబ్బంది పడేవాళ్లం. సమస్యను ఎమ్మెల్యే పేర్ని నాని దృష్టికి తీసుకువెళ్లటంతో స్పందించి రూ.29 లక్షలతో మెరక చేసి సిమెంటు రోడ్డు వేశారు. మా ప్రాంతంలో రోడ్డు సమస్య పరిష్కారమైంది.

– తోట శ్రీదేవి, బచ్చుపేట

తొలిరోజు నామినేషన్లు నిల్

- 22న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావు, 24న సింహాద్రి నామినేషన్ దాఖలు
- జనసేన రెబల్‌గా విక్కృతి శ్రీను?

అవనిగడ్డ: అవనిగడ్డలో తొలిరోజు ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. నామినేషన్ల స్వీకరణకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాలసుబ్రహ్మణ్యం అన్ని ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సింహాద్రి రమేష్‌బాబు ఈనెల 24న అవనిగడ్డలో, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు ఈనెల 22వ తేదీన మచిలీపట్నంలో, జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్ ఈనెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారు. జనసేన సీటు కోసం విశ్వప్రయత్నాలు చేసిన విక్కృతి శ్రీనివాసరావు ఆ పార్టీ రెబల్‌గా పోటీ చేయనున్నట్టు ఆయన అనుచరులు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థిగా అందె శ్రీరామమూర్తి, జైభీమ్ భారత్ పార్టీ తరఫున సముద్రాల అంబేద్కర్, బహుజన సమాజ్ తరఫున గుంటూరు నాగేశ్వరరావు నామినేషన్లు వేయనున్నారు.

రామాలయం వద్ద అన్నదానం

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండలంలోని కోసూరువారిపాలెంలో శ్రీ రామనవమి సందర్భంగా గురువారం అన్నదానం చేశారు. శ్రీ కోదండ రామాలయం వద్ద ప్రధాన సెంటర్‌లో అన్నదానాన్ని ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు తరలివచ్చి అన్నదానంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు



బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు లక్ష్మీనారాయణపురంలో శ్రీ సీతారామ లక్ష్మణ సహిత అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనిలో భాగంగా గురువారం స్వామివార్ల ప్రధానమూర్తులను, ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి మేళ, తాళాలతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు, భక్తుల సహకారంతో గతంలో ఉన్న పాత మందిరాన్ని తొలగించి సుందరమైన రామాలయాన్ని నిర్మించారు. ఉత్సవాలు మూడు రోజులు జరుగుతాయని ఈ నెల 21వ తేదీన ప్రతిష్ఠ అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఎన్నికల ఖర్చులపై ఫిర్యాదు చేయండి

పెడన: అభ్యర్థులు ఎన్నికల ఖర్చులకు సంబంధించి ఫిర్యాదులుంటే తక్షణం చేయాలని కృష్ణా జిల్లా సాధారణ ఎన్నికల పెడన, గన్నవరం, గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్షన్ వ్యయ పరిశీలకులు ఐసీఏఎస్ వికాస్ చంద్రకరోల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖర్చులపై 87126 93652 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

పదిమంది వలంటీర్ల రాజీనామా

పెడన: పట్టణంలోని ఐదో సచివాలయం పరిధిలో సేవలందిస్తున్న వలంటీర్లు గురువారం పది మంది తమ రాజీనామా పత్రాలను వార్డు అడ్మిన్‌కు అందజేశారు. తాము స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇప్పటి వరకు పెడన పట్టణంలో గురువారంతో రాజీనామా చేసిన వారి సంఖ్య 80కి చేరింది.

500 మందికి మజ్జిగ పంపిణీ




నాగాయలంక: వేసవి నేపథ్యంలో శ్రీఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యాన గ్రామంలోని విస్సంశెట్టి మల్లికార్జున రావు, లక్ష్మీనారాయణ(గోపి స్వీట్స్) ఆర్థిక సౌజన్యంతో స్థానిక ట్రాఫిక్ ఐలెండ్ కూడలిలో గురువారం 500 మంది బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ చిట్టా సాంబశివరావు, మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు కార్యక్రమం ప్రారంభించారు. శ్రీనివాసరావు కుమారుడు ప్రదీప్, సుకన్య వివాహ వేడుక పురస్కరించుకుని మజ్జిగ పంపిణీకి ఆర్థిక సహకారం అందించారు. పంచాయతీ వార్డు సభ్యుడు చిట్టా వీర అన్నపూర్ణయ్య, వంకాయల ఆది రాజేష్, చిట్టా వెంకట శేఖర్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

21న ధ్వజస్తంభ, విమాన శిఖర ప్రతిష్ట



అవనిగడ్డ: స్థానిక గీతామందిరంలో ఈ నెల 21వ తేదీన జీవధ్వజస్తంభ, విమాన శిఖర మహోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 19 నుంచి ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 19 ఉదయం 9 గంటలకు వాస్తు హోమం, శనివారం ఉదయం 9 గంటలకు విష్వక్సేన పూజ, అగ్ని మథనం, ఉక్త హోమం, ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



మచిలీపట్నం టౌన్: వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణమూర్తి (కిట్టు)లను గెలిపించాలని కోరుతూ నగరంలోని పలు డివిజన్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. 29వ డివిజన్‌లో కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ ఎర్ర శ్రీనివాస్ కుమార్, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రచారం చేశారు.

సంక్షేమం, అభివృద్ధి చూసి ఓటేయండి

ఘంటసాలలో ఎన్నికల ప్రచారం

ఘంటసాల: మీ గ్రామంలో చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి పనులను చూసి ఓట్లు వేయాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అల్లుడు డాక్టర్ రంగనాథ్ అన్నారు. ఘంటసాల పెద్దగూడెంలో గురువారం మూడోరోజు ఎన్నికల ప్రచారం ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్‌ల ఆధ్వర్యాన డాక్టర్ రంగనాథ్, సింహాద్రి నిశ్చల నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించి మన అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుకు, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలను, యువతను కోరారు. పలువురు మహిళలు మాట్లాడుతూ 'మా గ్రామంలో సీబీసీఎన్‌సీ పాఠశాల మూతపడటంతో ఎమ్మెల్యే రమేష్ బాబు చొరవతో మండల పరిషత్ పాఠశాలగా పునః ప్రారంభించారని, ఎన్నో ఏళ్లుగా ఇందిరమ్మ కాలనీలో రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న తమకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే రమేష్ బాబుకు, ఆయన తనయుడు వికాస్‌కు మా రోడ్లపై వివరించామని' తెలిపారు. వారు ఇచ్చిన హామీ ప్రకారం అంతర్గత రోడ్లను అభివృద్ధి చేశారని ఇంత మేలు చేసిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపిస్తామని వారు ఉత్సాహంగా తెలిపారు. తొలుత పెద్దగూడెంలోని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు డాక్టర్ రంగనాథ్, నిశ్చల స్థానిక నేతలతో కలిపి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షుడు దిరిశం పిచ్చేశ్వరరావు, నేతలు గొర్రెపాటి గోపాలకృష్ణ, పాల సోమేశ్వరరావు, కొల్లూరి శ్రీనివాసరావు, దేవినేని విజయ్ కుమార్, చిట్టూరి రమేష్, నడకుదురు గాంధీ, కొడాలి నాగమల్లి, చినపండు, విజయ్, మట్టా శ్రీనివాసరావు, యార్ల జనార్దనరావు, చికినం బాలాజీ, ఆకురాతి భాస్కరరావు, దిరిశం రాజు, మేరుగు ప్రకాశరావు, దిరిశం శ్రీను, రవి, కొడాలి వెంకటేశ్వరరావు, బాలకోటయ్య, చికినం బాలాజీ, దోనె వెంకటేశ్వరరావు, కుంపటి శరత్ కుమార్, పడమట వీరకుమార్, అంగడాల నాగరాజు, తిరందాసు భావనరుషి, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.


ఘంటసాల పెద్దగూడెంలో ప్రచారం చేస్తున్న డాక్టర్ రంగనాథ్, సింహాద్రి నిశ్చల, స్థానిక నేతలు

బస్ డ్రైవర్‌పై దాడి

కోనేరుసెంటర్: బస్సు డ్రైవర్‌పై కొంతమంది యువకులు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పెడన మండలం నందమూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ రామ్ కుమార్ ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్. బుధవారం రాత్రి విజయవాడ వైపు వెళ్తుండగా బందరు బైపాస్ రోడ్‌లో ట్రాఫిక్ జామ్ అయింది.

బస్సుకు ఎదురుగా ఉన్న కారులో కొంతమంది యువకులు ఉండగా డ్రైవర్ రామ్‌కుమార్ కారును పక్కకు తప్పించాలని కోరాడు. ఈ విషయంలో కారులోని యువకులకు డ్రైవర్ కు వాగ్వాదం జరిగింది. మాట మాట పెరిగి కొట్లాటకు దారి తీయడంతో కారులో ఉన్న అస్గర్, పండు అనే ఇద్దరు యువకులతో పాటు మరి కొంత మంది స్నేహితులు రామ్ కుమార్‌పై రాళ్లతో దాడి చేశారు. ఘటనలో రామ్‌కుమార్ తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చేరాడు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు చిలకలపూడి పోలీసులు బాధితుడు నుంచి ఫిర్యాదు అందుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

కోడూరు: అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ టి.వి.వి.సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థన మందిర సమీపంలో కోడూరుకు చెందిన పడమటి దుర్గారావు మద్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. దుర్గారావును తనిఖీ చేయగా 20 మద్యం సీసాలు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ తమ్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బృందగాన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: జాతీయ బృందగాన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ బహుమతి సాధించినట్లు డాక్టర్ కేకేఆర్ గౌతమ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. ఈనెల 7వ తేదీ మరట్వాడా తెలుగు అసోసియేషన్, ఏపీ కల్చరల్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బృందగాన పోటీల్లో తమ విద్యార్థులు ఘన విజయం సాధించినట్లు తెలిపారు. మొత్తం ఆరు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. తమ విద్యార్థులు సి. బృందావని, వి. సంకీర్తన, కె. దేవీప్రియ, ఎ. సుస్మిత, పి. హదన పరిమళ చంద్, పి. పూజశ్రీ, జి. శామ్యూల్ చరణ్, డి. సదీవన్ రాజు ఈ విజయాన్ని సాధించారన్నారు. బహుమతి సాధించిన విద్యార్థులను, సంగీత ఉపాధ్యాయుడు పి.శ్యామ్‌ను యాజమాన్యం అభినందించింది.

ఆర్వో కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు

- 200 మీటర్ల వరకు ర్యాలీలు, వంద మీటర్ల వరకు అభ్యర్థి కారులో రావడానికి అనుమతి
- అభ్యర్థితో పాటు నలుగురు మాత్రమే అదనంగా గన్‌మెన్
- గుర్తింపు కార్డులున్న వారు మాత్రమే లోపలకు..


ఆర్వో కార్యాలయం వద్ద హెల్ప్‌డెస్క్‌లో అధికారులు

పెడన: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైంది. నామినేషన్లు వేయడానికి అభ్యర్థులు భారీ ర్యాలీలు, ప్రదర్శనలు చేసుకుంటూ పురవీధుల్లో వచ్చినా ఆర్వో కార్యాలయానికి 200 మీటర్లు దూరంలోనే ప్రదర్శనలు ఆగిపోవాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 200 మీటర్లు తర్వాత అభ్యర్థి కారులో వంద మీటర్లు వరకు వచ్చేందుకు అనుమతి ఇచ్చారు. గుంపులుగా రావడానికి అనుమతుల్లేవు. వందమీటర్ల నుంచి ఆర్వో కార్యాలయానికి అభ్యర్థితో పాటు నలుగురు వ్యక్తులకు మాత్రమే అనుమతి ఇచ్చారు. అభ్యర్థికి గన్‌మెన్ ఉంటే ఆ అనుమతి ఇస్తారు.

ఆర్వో చాంబరుకు వెళ్లాలంటే

అభ్యర్థులు నామినేషన్ వేయడానికి వెళ్లాలంటే అభ్యర్థితో పాటు నలుగురుకి మాత్రమే అనుమతులు ఇచ్చారు. వీరు తొలుత హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించిన తర్వా కౌంటరు 1, 2, 3ల్లో నామినేషన్ పత్రాలు చూపించాల్సి ఉంటుంది. అక్కడ అన్నీ సక్రమంగా ఉన్నది లేనిది, అన్ని కాలమ్స్ పూర్తి చేసి ఇచ్చారా లేదా పరిశీలించిన తర్వాత అంతా సక్రమంగా ఉంటే తుదిగా ఆర్వో చాంబరుకు పంపిస్తారు. అక్కడ అభ్యర్థి ఆర్వోకు నామినేషన్ సెట్లను సమర్పించాల్సి ఉంటుంది.


ఆర్వో కార్యాలయం సమీపంలో పోలీస్ బందోబస్తు

కట్టుదిట్టంగా

ఆర్వో చాంబరు కార్యాలయానికి వెళ్లడానికి పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేశారు. పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్‌తో పాటు పెడన ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు. గుర్తింపు కార్డులున్న వారిని మాత్రమే కార్యాలయంలోనికి అనుమతిస్తున్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) ఈనెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు.

టీడీపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ 22న నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో ఈ రెండు రోజులలో మరింత బందోబస్తు చర్యలు తీసుకుంటామని పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

వృద్ధాశ్రమానికి అనాథ వృద్ధురాలు

చల్లపల్లి: దిక్కులేని స్థితిలో రోడ్డుపై పడి ఉన్న వృద్ధురాలిని సహృదయులు ఆశ్రమానికి చేర్చారు. స్థానిక ప్రధాన కూడలిలోని విజయవాడ బస్టాప్ వద్ద బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గుర్తు తెలియని వృద్ధురాలు కూర్చుని ఉంది. ఆమె కోసం ఎవరైనా వస్తారని భావించిన స్థానిక దుకాణదారులు ఆమెకు అల్పాహారం, తాగునీరు అందించారు. రాత్రి వరకూ ఎవరూ రాకపోవడంతో దుకాణాలు మూసివేసే సమయంలో ఆమె వివరాలు తెలుసుకునే ప్రయత్నించారు. సరైన వివరాలు చెప్పే పరిస్థితిలో వృద్ధురాలు లేకపోవడంతో ఆమె దీనస్థితిని పోలీసులకు, నిమ్మలతోటలోని సీయోను వృద్ధాశ్రమం నిర్వాహకులు శీలం భాస్కరరావుకు వివరించారు. ఆమె కుటుంబ సభ్యులను గుర్తించి అప్పగించే వరకు ఆశ్రమంలో నీడనివ్వడానికి నిర్వాహకులు భాస్కరరావు అంగీకరించడంతో వృద్ధురాలిని ఆశ్రమానికి తరలించారు. వృద్ధురాలి వద్ద ఆధార్‌కార్డు కూడా లేకపోవటంతో ఆమె వ్యక్తిగత వివరాలు తెలియలేదు. తనకు భర్త, పిల్లలు లేరనీ, తమ్ముడు, చెల్లి దగ్గర ఉండేదని ఆమె మాటల ద్వారా తెలిసింది. ఈ ఫొటోలో వృద్ధురాలిని ఆమె బంధువులు, కుటుంబ సభ్యులు, తెలిసిన వారు గుర్తించి వస్తే అప్పగిస్తామని ఆశ్రమ నిర్వాహకులు భాస్కరరావు తెలిపారు.


వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్చిన గ్రామస్తులు

పెరుగుతున్న పుల్లయ్య చిట్టీల బాధితులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో చిట్టీల వ్యాపారం పేరుతో రూ.కోట్లలో సొమ్ము వసూలు చేసి పరారైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తురకా పుల్లయ్య బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే స్థానిక విజయవాడరోడ్డులో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర చిట్‌ఫండ్స్ కంపెనీ ప్రారంభించి తోటి టీచర్లు, ఉద్యోగులను నమ్మించి రూ.కోట్లలో చిట్టీలు, డిపాజిట్లు కట్టించుకుని చివరికి ఉడాయించిన విషయం విదితమే. పక్కా పథకం ప్రకారం ముందస్తుగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ(వీఆర్ఎస్) చేయటంతో పాటు స్థిరాస్తులను ఇతర కుటుంబ సభ్యులు పేరిట బదలాయించి తురకా పుల్లయ్య, ఆయన కుమారుడు అశోక్ రాజు కుటుంబాలు పారిపోయారు. విషయం బయటపడటంతో ఒక్కొక్కరిగా బాధితులు బయటకు వస్తున్నారు. ఇప్పటికే తురకా పుల్లయ్య బాధితుల సంఘం పేరిట హనుమాన్‌జంక్షన్ పోలీసులకు శ్రీలక్ష్మీ వెంకటేశ్వర చిట్‌ఫండ్స్ మోసాలపై ఫిర్యాదు చేశారు. దీంతో రోజుకు కనీసం 10 మంది బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లబోదిబోమంటున్నారు. ప్రభుత్వ టీచర్ అనే నమ్మకంతో తమ జీతం, పెన్షన్ సొమ్ములను పిల్లల చదువులు, కుమార్తె పెళ్లి, ఇంటి నిర్మాణ అవసరాల కోసం చిట్‌ఫండ్ కంపెనీలో చిట్టీలు, డిపాజిట్ల పేరిట దాచుకున్నామని వాపోతున్నారు. తీరా ఇప్పుడూ తురకా పుల్లయ్య గుట్టుచప్పుడు కాకుండా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి కుటుంబంతో సహా పారిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ హనుమాన్‌జంక్షన్ పోలీసులను 55 మంది పుల్లయ్య బాధితులు ఆశ్రయించారు. చిట్‌ఫండ్స్ కంపెనీ పాసుపుస్తకం, రశీదులతో పాటుగా డిపాజిట్లకు పుల్లయ్య ఇచ్చిన చెక్కులు, ప్రామిసరీ నోట్లు పోలీసులకు పరిశీలిస్తున్నారు.

నాణ్యమైన సేవలు అందిస్తాం

గుడివాడ టౌన్: కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీ ఫెడరేషన్ అధ్యక్షుడు చిట్టూరి రవీంద్ర అన్నారు. స్థానిక గౌరీశంకరపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు, చిరు వ్యాపారులకు, మదుపరులకు ఈ బ్యాంకు సేవలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గత 25 సంవత్సరాలుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో సేవలందిస్తున్న ఈ బ్యాంకు గుడివాడలో 29వ శాఖ ఏర్పాటు చెయ్యడం శుభ పరిణామం అన్నారు.


20, 21 తేదీల్లో ఉచితంగా పుస్తకాల పంపిణీ

పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఏప్రిల్ 20, 21 తేదీల్లో విజయవాడ సర్వోత్తమ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరులోని మనసు ఫౌండేషన్ స్థాపకులు ఎం.వి. రాయుడు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ఇందులో సాధారణ గ్రంథాలతో పాటు తత్వశాస్త్రం, మతాలు, ఆధ్యాత్మిక, సాంఘిక, భాష, ఇంజినీరింగ్, వైద్య, విజ్ఞాన శాస్త్రాలు, కళలు, తెలుగు, ఆంగ్ల సాహిత్య గ్రంథాలు, చరిత్ర, బాల సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం తదితర విషయాలకు చెందిన పుస్తకాలే కాకుండా పదవ, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు సంబంధించిన వివిధ విద్యా సంస్థల స్టడీ మెటీరియల్స్‌తో కలిపి దాదాపు 35 వేలకు పైగా పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే వారితోపాటు, వత్తి విద్యా కోర్సులు అభ్యసించే వారికి కూడా ఉపయోగపడే వేలాది పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పౌరులందరూ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆపదలో ఉన్న వారికి అండగా

తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని గరికపర్రు పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం నాగమల్లేశ్వరరావు(చంటి) కుటుంబసభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. గూడూరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని బోలెం నాగమల్లేశ్వరరావు తీవ్రంగా గాయపడి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన భార్య బోలెం శివకుమారి(54) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. శివకుమారి మృతదేహాన్ని అనిల్‌కుమార్ గురువారం సందర్శించి నివాళులర్పించారు. కుమారుడు పవన్, కుమార్తె జ్యోత్స్నను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలను అరికట్టాలి



పామర్రు: వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకుని అగ్ని ప్రమాదాలను అరికట్టాలని పామర్రు విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి ఎన్.రాంబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం గ్రామంలోని శృతి హాస్పటల్లో అగ్ని ప్రమాదాల నివారణపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో తలుపు తీసిన తర్వాతే గ్యాస్ స్టవ్‌ను వెలిగించాలన్నారు. పెట్రోల్, గ్యాస్ వినియోగించే చోట సెల్‌ఫోన్లు వాడరాదని తెలిపారు. అనంతరం అగ్నిమాపక నియంత్రణ సూత్రాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. శృతి వైద్యశాల ఎండీ శేఖర్, వైద్యులు శృతి పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: అగ్ని ప్రమాదాల నివారణ పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జంక్షన్ అగ్నిమాపక కేంద్రం అధికారి జీఆర్ మోహనరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకుని విజయవాడ రోడ్డులోని మారుతీ గ్యాస్ ఏజెన్సీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.